

బలోపేతం దిశగా..

- సర్కార్ బడుల్లో పూర్వ ప్రాథమిక విద్యకు శ్రీకారం
- జోగులాంబ గద్వాల జిల్లాలో ఎంపికైన 19 పాఠశాలలు

6



మల్దకల్ మండలంలోని ఉలిగేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలి

● గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో పెండింగ్ అయకట్టు భూ సేకరణ పురోగతిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జవహర్ నెట్టెంపాడు లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు(కుడికాలువ)భూ సేకరణ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే రైతులకు నోటీసులు అందజేసినందున భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కింద 99/బీ, 100 ప్యాకేజీలకు అనుగుణంగా మంజూరైన చెక్కులను పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలన్నారు. భూసేకరణను వేగవంతం చేయడానికి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు కృషి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, భూసేకరణ ప్రత్యేక అదనపు కలెక్టర్ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఎస్ఈ రహీముద్దీన్, గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్, ధరూర్ తహసీల్దార్ నరేందర్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం

నాగర్‌కర్నూల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి ఇక ముందు అవలంభించాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. గడిచిన రెండు మాసాల్లో జిల్లాలో ఎక్సైజ్, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన దాడులు, పట్టుబడిన గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, నమోదైన కేసుల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతను, విద్యార్థులను మత్తుకు బానిసలుగా మారుస్తున్న మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్



స్థానికంగా కూలీల కొరత ఉండడంతో బిహార్, ఉత్తరప్రదేశ్ నుంచి నాట్లు వేయడానికి వచ్చిన కూలీలు

నాట్లు.. పాట్లు

- భారీ వర్షాలతో ముందుకు సాగని వ్యవసాయ పనులు
- కూలీల కొరతతో అన్నదాతల అగచాట్లు
- ముదిరిన వరి నారుమళ్లు
- జిల్లాలో నాట్లు వేసేందుకు బిహార్, ఉత్తరప్రదేశ్ కూలీలు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలతో జిల్లాలో వ్యవసాయ పనులు నిలిచిపోయాయి. కూలీలు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరినార్లు ముదిరి పోయాయి. అయినా నేటికీ స్థానిక కూలీలు రాకపోవడంతో బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి మధ్యవర్తుల ద్వారా నాట్లు వేసే కూలీలను పిలిపించుకుంటున్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం నుంచే ఎంజీఎల్ఐ ద్వారా ఎల్లూరు, సింగవట్నం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు రిజర్వాయర్లను కృష్ణా జలాలతో నింపడంతో ఊహించిన దాని కంటే ముందే సీజన్ మొదలైంది. కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా సమృద్ధిగా నీరు రావడం వరుణుడు కూడా కరుణించడంతో రైతుల్లో వానకాలం సీజన్‌పై ఆశాజనకమైన పరిస్థితి ఏర్పడింది.

పూర్తి కాని వరి నాట్లు

జూలై 20 నుంచి ఆగస్టు మాసమంతా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో వరి నాట్లు పూర్తికాలేదు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాలల్లో ఈ సీజన్‌లో 4,57,508 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయాల్సి ఉండగా ఇందులో పత్తి తర్వాత వరి విస్తీర్ణమే అధికంగా ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో 1లక్ష 49వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తి కావాల్సి ఉండగా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇంకా 20,436 ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉంది. చిన్న కమతాల్లో కూడా వరి సాగు చేస్తున్న నేపథ్యంలో కూలీల కొరత అన్నదాతలను అగచాట్లకు గురి చేస్తుంది. ఈ నేపథ్యంలో బీహార్, ఉత్తరప్రదేశ్‌ల నుంచి కూలీలు ఇక్కడికి వచ్చి నాట్లు వేస్తుండడం గమనార్హం. బిహార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన కూలీలు ఒక్కొక్క బృందంలో కనీసం 9మంది మూడెకరాల్లో వరి నాట్లు వేసిన వారికి కనీసం వెయ్యి రూపాయల పైన గిట్టుబాటు అవుతుండడంతో ఆ రాష్ట్రాలకు చెందిన కూలీలు ఇక్కడే తాత్కాలిక ఆవాసాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు.

పత్తి రైతు చిత్తు..

జిల్లాలో అధిక వర్షాలు పత్తి రైతులను నట్టేటా ముంచాయి. వానాకాలంలో 2,86,965ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయాల్సి ఉండగా 2,65,965ఎకరాల్లో సాగుచేశారు. భారీ వర్షాల కారణంగా పత్తి పంట నీట మునగడం, చీడపీడల బాధ అధికమైంది. సాధారణంగా వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఎకరా పత్తి పంటకు 12 నుంచి 15క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పెట్టుబడులు రూపంలో దాదాపు 40వేల దాకా ఖర్చైనా ఎకరాకు 30 నుంచి 40వేల ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఎకరాకు 5క్వింటాళ్లు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి కన్పించడం లేదని పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఇంకా ఇలాగే కురిస్తే నిండా మునగడం ఖాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యూరియా కొరత..

తీరని వ్యథ

ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద ఉదయం నుంచే రైతుల బారులు



అయిజ రైతు వేదిక వద్ద యూరియా కోసం ఎదురు చూస్తున్న మహిళా రైతులు



అమరచింతలో యూరియా టోకెన్ల కోసం పోలీసులతో వాగ్వాదానికి దిగిన రైతులు

- రహదారులు, కూడళ్లు, పీఏసీఎస్‌ల వద్ద రైతుల నిరసనలు
- ఒక్కో రైతుకు రెండు నుంచి ఒక్క బస్తాకు తగ్గిన సీలింగ్
- లైన్లను అదుపు చేయలేక పలుచోట్ల పోలీసుల అత్యుత్సాహం
- మరికల్ మండలం తీలేరులో రైతుపై చేయి చేసుకున్న ఎస్ఐ రాము

మహబూబ్‌నగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరినాట్లు ఇంకా కొనసాగుతుండటం, పత్తి, మొక్కజొన్నవంటి పంటలకు ఈ దశలో ఎరువులు వేయాల్సిన పరిస్థితి ఉండటంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. గతంలో ఒక్కో రైతుకు రెండు బస్తాలు మాత్రమే ఇస్తామని సీలింగ్ విధించగా.. ఇప్పుడు అది కాస్త ఒక్క బస్తాకు తగ్గించారు. విక్రయ కేంద్రాల్లో నిల్వ ఉన్న యూరియా బస్తాల కంటే లైన్లలో నిల్చునే రైతులు అధికంగా ఉంటున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్కో

(మిగతా 6లో..)

సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

- గణేశ్ ఉత్సవాల్లో అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ

6

పేట, కొడంగల్ ఎత్తిపోతలకు వ్యతిరేకం కాదు

- బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ



దీక్షలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్

7

విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక విద్యలో పట్టు సాధించాలి

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్
- వర్సిటీలో ఓరియెంటేషన్ ప్రోగ్రాం

7

కోర్టుకు స్థలాన్ని పరిశీలించిన హైకోర్టు జడ్జి



కోర్టు స్థలాన్ని పరిశీలిస్తున్న హైకోర్టు జడ్జి అనిల్‌కుమార్

వనపర్తి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) లీగల్ కంట్రిబ్యూటర్: జిల్లా కేం ద్రంలో నూతన కోర్టు భవనాలకు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని శనివారం హైకోర్టు జడ్జి, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి అనిల్‌కుమార్, కలెక్టర్ ఆదర్శ్ సురభి పరిశీలించారు. అంతకు ముందు ఆయన జిల్లా కోర్టు ఆవరణలో జ్యూడిషల్ అధికారులతో సమావేశమయ్యారు. కోర్టు కు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. కోర్టు ఆవరణలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డీ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జడ్జిని సన్మానించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, జిల్లా న్యాయాధికారి ఎం.ఆర్ సునీత, సీనియర్ న్యాయాధికారులు రజని, కళార్చన కవిత, జూనియర్ న్యాయాధికారులు కార్తీక్‌రెడ్డి, అశ్విని, ఆత్మకూరు కోర్టు న్యాయాధికారి శిరీష తదిత రులు పాల్గొన్నారు.

క్రీడా హబ్‌గా తెలంగాణ



పతకాలు సాధించిన క్రీడాకారులకు మెడల్స్ అందజేసిన రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి

ఆటలకు రూ.460 కోట్ల బడ్జెట్

- గత సర్కార్ నిర్లక్ష్యం చేసింది
- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి
- అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ టోర్నీ
- డిస్కస్‌త్రోలో పాలమూరుకు బంగారు పతకం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): క్రీడల హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీ సింథటిక్ ట్రాక్‌పై జి.రాజేంద్రప్రసాద్ స్మారక 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నారు. అండర్-14, 16, 18, 20 జూనియర్ బాల, బాలికల విభాగాల్లో క్రీడలను ఏర్పాటు చేస్తున్నారు. శివసేనా రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఎంపీ జితేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శివసేనా రెడ్డి మాట్లాడుతూ పదేళ్లుగా బీఆర్ఎస్ సర్కార్ క్రీడలను

(మిగతా 6లో..)



అసెంబ్లీలో శనివారం నిర్వహించిన సమావే శాలకు ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. సమావేశాలకు వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరయ్యారు.



భారీ వర్షాలతో రాకపోకలకు అంతరాయం

- బీజేపీ జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు

6

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

7

మహిళ మృతిపై అనుమానాలు

- వైద్యం వికటించిందని బాధితుల ఆగ్రహం



సుభద్రమ్మ (ఫైల్)

కొల్లాపూర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని జావాయిపల్లికి చెందిన సుభద్రమ్మ(60) శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఆమె మృతి పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జావాయిపల్లి గ్రామానికి చెందిన సుభద్రమ్మ (60) శుక్రవారం మధ్యాహ్నం ఛాతిలో నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలిపింది. ఆమె మనవడు వంశీకృష్ణ బైక్‌పై యన్మన్‌బెట్ల గ్రామంలో ఆర్ఎంపీ డాక్టర్ వినోద్ దగ్గరికి తీసుకువెళ్లాడు. వైద్యం చేయించుకొని అదే బైక్‌పై సొంత గ్రామానికి బయలుదేరారు. కొద్దిదూరం వెళ్లాక సుభద్రమ్మ తనకు కళ్లు తిరుగు తున్నాయని తెలపడంతో వంశీకృష్ణ బైక్ ఆపి ఆమెను పరిశీలించి వెంటనే ఆర్ఎంపీ డాక్టర్‌కు ఫోన్ చేసి విష యం చెప్పాడు. ఆర్ఎంపీ డాక్టర్ అక్కడికి వచ్చి బీపీ చెక్‌చేసి లోబీపీ ఉందని త్వరగా కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించాడు. అక్కడి నుంచి కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్తే అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. ఆర్ఎంపీ చేసిన వైద్యం వికటించి సుభద్రమ్మ మృతి చెందిందని ఆగ్రహంతో డాక్టర్‌పై దాడి చేశారు. అనంతరం సుభద్రమ్మ మృతిపై పూర్తి విచారణ చేయాలని కుటుంబ సభ్యులు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారికి శనివారం ఫిర్యాదు చేశారు. హైడోస్ ఇన్‌జక్షన్ ఇచ్చిన ఆర్ఎంపీ డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

యూరియా కొరత.. తీరని వ్యథ

(5వ పేజీ తరువాయి)

రైతుకు సీలింగ్ ప్రకారం ఒక్క బస్తా ఇవ్వడానికి కూడా ఎరువు సరఫరా కావడం లేదు. అధికారులు మాత్రం యూరియా కొరత లేదనే పాత పాటే పాడుతున్నారు. కేంద్రం ఇటీవల కేటాయించిన 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరుకుంటే కానీ పరిస్థితులు అదుపులోకి రావడం కష్టంగానే కనిపిస్తోంది. ఇదే అదునుగా ప్రైవేటు దుకాణాల నిర్వాహకులు ఎక్కువ ధరలకు అమ్మి.. సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా యూరియాను నిల్వ ఉంచుకుంటున్నారు. వారు అధిక ధరలకు ఎరువుల విక్రయాన్ని కట్టడి చేసేందుకు విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తున్నారు. శుక్రవారం పెద్దమందడి మండలం వెల్టూరులో రామలింగేశ్వర ఫర్టిలైజర్ దుకాణంలో ఇదే కారణంతో 300 యూరియా బస్తాలను స్వాధీనం చేసుకుని కేసు కూడా నమోదు చేశారు. యూరియా కొరత ఏర్పడుతుందనే అంచనాలు వేసుకున్న కొందరు రైతులు, పలుకుబడి ఉన్నవారు నిల్వ చేసుకోవడంతో కూడా కొరత తీవ్రమైనట్లుగా అధికారులు భావిస్తున్నారు.

పోలీసుల అత్యుత్సాహం..

ఒక్క యూరియా బస్తా దొరికితే చాలు.. పంటలు కాపాడుకోవచ్చనే ఉద్దేశంతో రైతులు ఉదయం నుంచే బారులు తీరుతున్నారు. తిండి తిప్పలు మానేసి లైన్లలో వేచి ఉంటున్న వారిని కొంత సమన్వయంతో శాంతింపజేయాల్సిన అవసరం ఉంది. కానీ కొన్నిచోట్ల పోలీసులు వారిని అదుపు చేయడంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. కొరత ప్రారంభమైన కొత్తలో నారాయణపేట జిల్లా నర్వ మండలంలోని సింగిల్ విండో వద్ద తోపులాట జరగ్గా.. పోలీసులు తోయడంతో ఒక రైతు చేయికి గాయమైంది. ప్రతీ రోజూ రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద బారులు తీరుతుండటంతో పోలీసులు కూడా అదుపు చేయలేక అసహనానికి గురవుతున్నారు. తాజాగా నారాయణపేట జిల్లా మరికల్ మండలం తీలేరులోనూ పోలీసుల అత్యూత్సాహం కనిపించింది. లైన్‌లో రైతులను అదుపు చేసే క్రమంలో మరికల్ ఎస్ఐ రాము ఒక యువ రైతుపై చేయి చేసుకున్నాడు. ముందుగా చేయి ఎత్తి బెదిరించి, తర్వాత చెంపపై కొట్టాడు. దీనిపై స్పందించిన నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్ రైతులపై దురుసుగా ప్రవర్తించిన ఎస్ఐ రాముపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. రైతుపై చేయి చేసుకున్న విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఓవైపు కొరత తీర్చకుండా.. మరోవైపు రైతులపై దాడులు చేస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శించాయి. కావాలని ఎస్ఐ తనను కొట్టలేదని రైతు సత్యనారాయణ వివరణ ఇవ్వడం గమనార్హం.

రాజకీయ దుమారం..

యూరియా కొరత ప్రారంభమైనప్పటి నుంచి అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ దుమారం రేగుతూనే ఉంది. తమ హయాంలో యూరియా కొరత లేదని, ముందస్తుగానే నిల్వలు ఉంచుకోవడం వల్ల రైతులకు ఇబ్బందులు కలుగనివ్వలేదని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారు. ఆ పార్టీ సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో యూరియా కొరతను ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు. ఎక్కడైనా రైతులకు ఇబ్బంది కలిగితే పొలిటికల్‌గా మైలేజీ పొందడానికి ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. మరోవైపు యూరియా కొరతపై కాంగ్రెస్ పార్టీ అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీలను కౌంటర్ చేస్తోంది. బీఆర్ఎస్ హయాంలో యూరియా కొరతతో రైతుల క్యూలైన్లు, అప్పటి ప్రజాప్రతినిధుల ప్రకటనలను సోషల్ మీడియాలో పెట్టి.. ఎదురుదాడి చేస్తోంది. తీలేరు ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్‌లో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ పోస్టు పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సున్నితంగా మారిన యూరియా కొరత విషయాన్ని ఆయా పార్టీలు పొలిటికల్ కోణంలో చూస్తూ దాడి, ప్రతిదాడులు చేసుకుంటున్నాయి. మహబూబ్‌నగర్‌లోనూ ఈ నెలలోనే ఓ వ్యక్తి విక్రయ కేంద్రం వద్ద సొమ్మసిల్లి పడిపోవడం బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య వివాదాన్ని రేపింది.

మోస్తరు వర్షం

నాగర్‌కర్నూల్ టౌన్/నారాయణపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు అక్కడక్కడ మోస్తరు వర్షం కురిసింది. నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో 24.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తిమ్మాజిపేట మండలంలో 13.8, బిజినేపల్లిలో 12.4, అచ్చంపేటలో 12.0, వంగూరులో 10.8, నాగర్‌కర్నూల్‌లో 9.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో 17.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.

వర్షానికి కూలిన ఇల్లు

» ఇద్దరికి గాయాలు

మరికల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో కురిసిన భారీ వర్షాలకు శనివారం మేకల ప్రసాద్‌కు చెందిన ఇల్లు కూలిపోయింది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు వారు వెంటనే బయటకు పరుగులు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బాధితులను గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్‌రెడ్డి సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

కోతుల దాడిలో ఉపాధ్యాయురాలికి గాయాలు

వెల్దండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కోతులు దాడిచేయడంతో ఉపాధ్యాయురాలు గాయపడిన సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. పాఠశాలకు చెందిన రామేశ్వరమ్మ అనే ఉపాధ్యాయురాలిపై కోతులు దాడిచేసి గాయపరిచాయి. దీంతో ఆమె స్థానిక ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. కోతులు దాడిచేయడంతో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తంచేశారు. కోతుల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుగుణ కోరారు.

పర్వతారోహణ శిబిరానికి ఎంపిక

నారాయణపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్స్ పర్వతారోహణ శిబిరానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మేర్సీ వసంత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు చెందిన అన్వేష, జయశ్రీ, నాగేశ్వరి తృతీయ సంవత్సరం విద్యార్థులు కేరళలో జరిగే ఆల్ ఇండియా పర్వతారోహణ శిబిరాలలో పాల్గొంటారని పేర్కొన్నారు. వారు పది రోజుల పాటు పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను శనివారం కళాశాలలో అభినందించి వారు కేరళ శిబిరానికి బయలుదేరారు. ఎన్‌సీసీ ఇన్‌చార్జి సుజత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సమయానికి బస్సు నడపాలి



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

నారాయణపేటరూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాల సమయాలకు బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బస్టాండ్ ముందు మండలంలోని పేరపళ్ల విద్యార్థులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సమయానికి బస్సులు రాకపోవడంతో పాఠశాల, కళాశాలలకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 8.30గంటల లోపు తమ గ్రామానికి బస్సు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న డిపోమేనేజర్ ఫోన్లో విద్యార్థుల సమస్యను పరిష్కరిస్తామని హామీనివ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నరేష్, సతీష్, వివేకానంద, చరణ్‌రెడ్డి, ఇంతియాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బలోపేతం దిశగా..

» సర్కార్ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యకు శ్రీకారం

» గద్వాల జిల్లాలో తరగతుల నిర్వహణకు ఎంపికైన 19 పాఠశాలలు



పూర్వ ప్రాథమిక విద్యకు ఎంపికైన గద్వాల మండలంలోని పర్మాల ఎంపీపీఎస్

గద్వాల సర్కిల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. అందులో భాగంగా ప్రాథమిక పాఠశాలలో ఈ ఏడాది (2025-26 విద్యా సంవత్సరం)నుంచే పూర్వ ప్రాథమిక తరగతుల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు గత నాలుగు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం అధికారంగా ఉత్తర్వులు జారీ చేసింది. సర్కార్ బడుల్లో మెరుగైన పాఠశాల విద్యను అందించే క్రమంలో జోగుళాంబ గద్వాల జిల్లాలో 19 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసింది. ప్రైవేట్ పాఠశాలల్లో కొనసాగే ప్రీ ప్రైమరీ విద్యాభ్యాసం (యూకేజీకి సమాంతర విద్య) ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో తరగతుల నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు బలోపేతం దిశగా పయనించనున్నాయి.

జిల్లాలో 285 ప్రాథమిక పాఠశాలలు...

జోగుళాంబ గద్వాల జిల్లాలో 285 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అందులో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 20,932 మంది ఉన్నారు. ఈ ఏడాది నుంచే పూర్వ ప్రాథమిక తరగతుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతినివ్వడంతో తల్లిదండ్రులు నాలుగేళ్లు దాటిన తమ చిన్నారులను ఎంపికైన ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశం కల్పించేందుకు సన్నద్ధం కానున్నారు.

ప్రీ ప్రైమరీ పాఠశాల విద్యకు జిల్లాలో 19 పాఠశాలలు ఎంపిక...

2025-26 విద్యా సంవత్సరం నుంచి ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు అనుమతులు ఇస్తూ జిల్లాలోని 19 ప్రాథమిక పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి ఉత్తర్వులు జారీ చేసింది.

వాటిలో గద్వాల మండలం పర్మాల ఎంపీపీఎస్, మల్దకల్ మండలంలోని నాగర్‌దొడ్డి ఎంపీయూపీఎస్, ఉలిగేపల్లి ఎంపీపీఎస్, ధరూర్ మండలం యనుమోనిపల్లి ఎంపీపీఎస్, గట్టు మండలంలోని చమాన్‌ఖాన్‌దొడ్డి ఎంపీపీఎస్, ఇందువాసి ఎంపీపీఎస్, ఆరగిద్ద ఎంపీపీఎస్, ఆలూరు ఎంపీపీఎస్, బల్గెర ఎంపీ పీఎస్, కేటిదొడ్డి మండలంలోని నందిన్నె ఎంపీపీఎస్, చింతలకుంట ఎంపీపీఎస్, అలంపూర్ ఎంపీపీఎస్ (గర్ల్స్), అయిజ మండలంలోని కేశవరం ఎంపీయూపీఎస్, ఈడిగోనిపల్లి ఎంపీయూపీఎస్, ఇటిక్యాల మండలం చాగాపూర్ ఎంపీపీఎస్, ఎర్రవల్లి మండలం కారుపాకుల ఎంపీపీఎస్, వడ్డేపల్లి ఎంపీపీఎస్, ఉండవల్లి మండలం మారమునగాల-1 ఎంపీపీఎస్, రాజోలి మండలం చింతలక్యాంపు ఎంపీపీఎస్‌లున్నాయి.

ప్రతీ పాఠశాలకు ఒక ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయా...

పూర్వ ప్రాథమిక విద్యలో భాగంలో ప్రవేశం పొందిన విద్యార్థుల తరగతుల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపికైన ప్రతీ పాఠశాలకు ఒక ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయాను నియమించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్ ఉత్తీర్ణత, ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలి.

ప్రాథమిక పాఠశాలల బలోపేతం కోసం..

ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచే పూర్వ ప్రాథమిక తరగతుల నిర్వహణకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేట్ పాఠశాలలో అందించే ప్రీ ప్రైమరీ విద్యను ఇప్పుడు ప్రభుత్వం పాఠశాలల్లోనూ అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం. తల్లిదండ్రులు నాలుగేళ్లు దాటిన తమ చిన్నారులను ప్రీ ప్రైమరీ విద్య కోసం కల్పించే ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో ఎంపికైన 19 పాఠశాలలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. తరగతుల నిర్వహణకు 19 మంది ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, 19 ఆయా పోస్టులను తాత్కాలిక పద్ధతిపై భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- ఎస్తేర్‌రాణి, జిల్లా విద్యా శాఖ సమన్వయ అధికారి, గద్వాల

ప్రవేశం పొందిన విద్యార్థులకు కల్పించే మౌలిక వసతులు

ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు ఎంపికైన పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ప్రవేశం పొందిన చిన్నారులకు ప్రత్యేక తరగతులు కేటాయిస్తారు. వారికి ఆహ్లాదభరితమైన వాతావరణం కల్పించేలా అన్ని వసతులు కల్పిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతో పాటు ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం కల్పిస్తారు. ప్రీ ప్రైమరీలో చేరే ప్రతి విద్యార్థి పూర్తి వివరాలను యూడైస్‌లో నమోదు చేస్తారు.



మార్చ్ నిర్వహిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు



జావెలిన్‌త్రో చేస్తున్న క్రీడాకారుడు

క్రీడా హబ్‌గా తెలంగాణ

(5వ పేజీ తరువాయి)

పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వాలు క్రీడాభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.50 కోట్లు ఇస్తే, కాంగ్రెస్ సర్కార్ రెండేళ్లలో రూ.850 కోట్లు క్రీడా బడ్జెట్ కేటాయించిందని తెలిపారు. రాష్ట్రంలోని అకాడమీలు, హాస్టల్స్, స్పోర్ట్స్ స్కూల్‌లో మౌలిక వసతుల కల్పన కృషి చేస్తున్నామని తెలిపారు. 3వ విడతలో జిల్లా, మండల కేంద్రాల్లో క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. అందరూ మెచ్చేలా తెలంగాణ క్రీడా పాలసీ తెచ్చామన్నారు. ఒలింపిక్ క్రీడల్లో చిన్న దేశాలు పతకాలు సాధిస్తున్నాయని, 140 కోట్ల జనాభా ఉన్న మన దేశంలో ఒక్క పతకం సాధిస్తున్నామన్నారు. 2036 ఒలింపిక్ క్రీడల్లో దేశంలోనే తెలంగాణ క్రీడాకారులు అధిక పతకాలు సాధించేలా తయారు చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

క్రీడాభివృద్ధికి రూ.16 కోట్లు మంజూరు: జితేందర్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో క్రీడాభివృద్ధికి రూ. 16 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇండోర్ స్టేడియంలో ఏసీ, స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే వాలీబాల్ అకాడమీ ప్రారంభించామని అన్నారు. కబడ్డీ అకాడమీని కూడా నెలకొల్పుతామన్నారు. క్రీడల్లో తెలంగాణను దేశానికి రోల్ మాడల్‌గా నిలపాలన్న సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని అన్నారు. అంతకు ముందు క్రీడా జ్యోతిని వెలిగించారు. వివిధ జిల్లాల క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. క్రీడాకారులకు పతకాలు అందజేశారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్, పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, మాజీ వీ సీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్, డీవైఎస్‌వో శ్రీ నివాస్, టీజీ పీడీ, పీఈటీ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మార్టిన్, శరత్‌చంద్ర పాల్గొన్నారు.



పరుగుపందెంలో పాల్గొన్న క్రీడాకారులు

విజేతల వివరాలు..

ఆయా విభాగాల్లో పలువురు క్రీడాకారులు తొలిరోజు ప్రతిభ చాటి, పతకాలు సాధించారు. అండర్-18 బాలికల డిస్కస్‌త్రో విభాగంలో పౌర్ణమి(మహబూబ్‌నగర్) బంగారు పతకం సాధించింది.

సింధు(హన్మకొండ) రజతం, అక్షయసింధు(జనగామ) కాంస్య పతకాలు సాధించారు. అండర్-14 బాలికల జావెలిన్ త్రోలో సంయుక్త శ్రీ(హన్మకొండ), వృధిక(కొత్తగూడెం), అస్మా, భూపాలపల్లి), బాలుర విభాగం డిస్కస్‌త్రోలో సునీత కుమార్(జనగాం), వరుణ్‌గౌడ్ (రంగారెడ్డి), రాజేంద్ర(జనగాం) వరుసగా బంగారు, రజతం, కాంస్య పతకాలు సాధించారు. అండర్-14 జావెలిన్ త్రో బాలుర విభాగంలో రాకేష్(ఆదిలాబాద్), అనురాగ్‌పేట్(తెలంగాణ అథ్లెటిక్ అసోసియేషన్), కరుణదేవ్(టీఏఏ), అండర్-18 బాలికల 3 వేల మీటర్ల పరుగు పందెంలో పండు(హన్మకొండ), ముస్కాన్(హైదరాబాద్), రిషిక(ఆదిలాబాద్), బాలుర 5 వేల మీటర్ల పరుగు పందెంలో మోహిత్(టీఏఏ), అశోక్ రాథోడ్(మెదక్), ధోని(నల్గొండ), అండర్-20 బాలుర విభాగంలో 10 వేల మీటర్ల పరుగు పందెంలో గణేష్(సిద్దిపేట), జశ్వంత్(ఆదిలాబాద్), అబ్దుల్ కరీం(గద్వాల), అండర్-20 బాలికల విభాగంలో 5 వేల మీ పరుగు పందెంలో వరలక్ష్మీ(వికారాబాద్), ఉషారాణి(కొత్తగూడెం), నందిని(వనపర్తి) వరుసగా బంగారు, రజతం, కాంస్య పతకాలు సాధించారు.

సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

» గణేశ్ ఉత్సవాల్లో అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామి



కొల్లాపూర్‌లో శివగంగ గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ

కొల్లాపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు నేటి తరం యువత ముందుండాలని అంబాత్రేయ క్షేత్రపీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామి కోరారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని శివగంగ యువక బృందం ఆధ్వర్యంలో పట్టణంలో అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో విఘ్నేశ్వరుడిని శనివారం అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివగంగ యువక బృందం సభ్యులు పట్టణ ప్రజలు అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామికి ఘనంగా స్వాగతం పలికి శాలువా పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ పట్టణ ప్రజల ను ఉద్దేశించి ఆదిత్య పరాశ్రీ స్వామి మాట్లా డుతూ... మన చుట్టూ ఉన్న ప్రదేశాలలో ఎక్కడ జాతరలు కానీ దైవ కార్యక్రమాలు జరి గిన అందరూ తప్పక పాల్గొని సంఘటితంగా సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కొల్లాపూ ర్ పట్టణ ప్రజలకు ఆయన ఆశీస్సులు అంద జేశారు. శివగంగ యువక బృందం ఆధ్వర్యం లో భక్తులకు అన్నదానం నిర్వహించారు. బీ జేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్ రావు, సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మహిళలు శివగంగ యోగా సభ్యులు పాల్గొన్నారు.

సీఎంతో మాట్లాడి రూ. 20 లక్షలు పరిహారం ఇప్పిస్తా

దామరగిద్ద, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా కానుకుర్తి రిజర్వాయర్‌లో భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు రూ. 20 లక్షలు ఇప్పిస్తానని డీసీసీ నారాయణపేట మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి రైతులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని కానుకుర్తిలో పరిహారం పెంపు కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు దగ్గర వెళ్లి భూ నిర్వాసితులతో గ్రామ నాయకులతో చర్చించారు. తమకు ఎకరాకు రూ. 35లక్షలు పరిహారం ఇస్తేనే రిజర్వాయర్ నిర్మాణానికి భూములు ఇస్తామని రైతులు తెల్పి చెప్పారు. దీంతో శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం నారాయణపేట సభలో రూ.20 లక్షలు ఇస్తామని చెప్పారని అదే మాట ప్రకారమే సీఎంతో మాట్లాడి ఇప్పిస్తానని అన్నారు. కొంత మంది రైతులు ఎకరాకు రూ. 35 లక్షలు ఇస్తేనే రిజర్వాయర్ నిర్మాణానికి భూములు ఇస్తామని లేకపోతే ఇవ్వమని శివకుమార్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. రైతులతో రెండు గంటల పాటు చర్చలు జరిపినా ఒప్పుకోకపోవడంతో అసహనానికి గురైన శివకుమార్‌రెడ్డి దీక్ష శిబిరం నుంచి వెళ్లిపోయారు.



కానుకుర్తి రైతులతో చర్చిస్తున్న శివకుమార్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో శనీశ్వర స్వామికి అభిషేకాలు

బిజినేపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బిజినేపల్లి మండలంలోని నందివడ్డెమాన్‌లోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో తిల, తైల అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ భక్తుల జన్మ, గోత్ర రీత్యా గ్రహ దోషాలు తొలగుటకు శనిగ్రహ శాంతి కోసం శనీశ్వర స్వామిని శనివారం పూజించాలని సూచించారు. శనీశ్వర స్వామిని నల్లని వస్త్రాలు ధరించి నల్ల నువ్వులు, నువ్వుల నూనె, జిల్లెడు ఆకులు, పూలు, జమ్మి ఆకులతో పూజించాలని తెలిపారు. అనంతరం రుద్ర శివుడి ఆలయంలో అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గోపాల్‌రావు, వీరశేఖర్, ప్రభాకరాచారి, అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమ్మయ్య, జయంత్, సిబ్బంది గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

భారీ వర్షాలతో రాకపోకలకు అంతరాయం

» బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

అచ్చంపేట, ఆగసు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని, రహదారులను వెంటనే మరమ్మతులు చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి నుంచి మన్నెవారిపల్లి గ్రామం వరకు అవసరమైన చోట వంతెన నిర్మాణాలు చేపట్టాలని రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఈ రహదారులు పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి ప్రయాణికులు, వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ప్రజల భద్రత దెబ్బతింటుందని పనులు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు బాలకృష్ణ, గణేష్, మల్లాజీ, బాలస్వామి, భగవంతు, అంజి పాల్గొన్నారు.

మూడు కాళ్లతో గేదె దూడ జననం



ఖానాపూర్‌కు చెందిన మున్నూర్ శేఖర్ గేదెకు పుట్టిన మూడు కాళ్ల దూడ

బిజినేపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పాడి గేదె లేగదూడకు జన్మనివ్వగా వింతగా మూడు కాళ్లతోనే పుట్టింది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన మున్నూర్ శేఖర్‌కు చెందిన గేదె శనివారం గేదె పిల్లను ప్రసవించింది. దానిని పరిశీలించిన రైతు మూడు కాళ్లు మాత్రమే ఉండడంతో ఆందోళన చెంది పశువైద్యాధికారికి సమాచారం ఇచ్చాడు. జన్యుపరమైన లోపాలు ఉంటే ఇలాంటి వింత దూడలు పుడుతాయని అన్నారు. మూడు కాళ్లతో ఉన్న గేదెదూడ ఆరోగ్యంగా ఉందని రైతు అన్నాడు. మూడు కాళ్లతో పుట్టిన దూడను ఆశ్చర్యంతో చూస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 32 మంది బాలబాలికల ఎంపిక



క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

మక్తల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): క్రీడా దినోత్సవం రోజు పేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల్లో 32మంది రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు గోపాలం తెలిపారు. శనివారం పట్టణంలోని మినీ స్టేడియంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి 200 మంది బాలబాలికలు పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో 14,16,18ఏళ్ల విభాగంలో మొత్తం 32మంది రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన వారికి ప్రశంసాపత్రాలు, మెడల్స్, శాలువాతో సత్కరించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 15మంది పీఈటీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రూప, విష్ణువర్ధన్‌రెడ్డి, అంబ్రేష్, రమేష్‌కుమార్, రుద్రసముద్రం రామలింగం, నాగమణి, అంజనేయులు, ఉశప్ప, జగదీశ్వర్ పాల్గొన్నారు.

కారు బోల్తా - ముగ్గురికి గాయాలు

వెల్దండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రం సమీపంలో హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం అదుపుతప్పి కారు బోల్తా పడటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు వెళుతున్న కారు వెల్దండ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో కారులో ఉన్న అచ్చంపేటకు చెందిన మన్సూన్, అతని భార్య రేష్మాబేగం, కుమారుడు ముసాధీర్‌లు గాయపడ్డారు. గాయపడ్డవారికి చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.


గద్వాల టీటీ యూత్ ఆధ్వర్యంలో గౌరి దేవి చెంతన వినాయకుడి విగ్రహం


పేట సుభాష్‌రోడ్‌లో 18 అడుగుల వినాయకుడు


వనపర్తి బ్రహ్మంగారి వీధిలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో అలంకరించిన మండపంలో కొలువుదీరిన గణేశుడు


వనపర్తి వాసవీ ఆలయంలో దశావతారంలో అలంకరించిన మండపంలో కొలువుదీరిన లంబోదరుడు


జడ్చర్లలో పూరిజగన్నాథ్ రథయాత్ర అలంకరణలో..

వినూత్నం.. వినాయకం

సర్వ విఘ్నాలను తొలగించే విఘ్నేశుడు వినూత్నంగా వాడవాడలా పూజలందుకుంటున్నాడు. వినాయక చవితి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తూ.. మా విఘ్నాలు తొలగించు వినాయకా అంటూ పూజిస్తున్నారు. పలు చోట్ల విభిన్న ఆకారాల్లో సర్వాంగ సుందరంగా విఘ్నేశ్వరుల మండపాలను డెకరేషన్.. విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా వినూత్న రీతుల్లో కొలువైన వినాయకుల దృశ్యాలను ఆంధ్రజ్యోతి తన కెమెరాల్లో బంధించింది.

- న్యూస్‌నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు, మహబూబ్‌నగర్, వనపర్తి


అప్పన్నపల్లిలోని హైందవ శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద భక్తులు


అయిజ కృష్ణవేణి పాఠశాలలో గుర్రాల రథచక్రాలపై ..


పేటలో కుర్వగేరి యువసేన ప్రతిష్ఠించిన నాట్యవినాయకుడు


మహబూబ్‌నగర్ పాల్‌సాబ్ గుట్ట వినాయకుడు


జడ్చర్ల పట్టణంలోని బాబీస్ట్రీట్‌లో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గణనాథుడు


మహబూబ్‌నగర్‌లో కృష్ణ టాకీస్ వద్ద వినాయకుడు


పేట పత్తిబజార్‌లో సింహంపై కూర్చున్న వినాయకుడు


మహబూబ్‌నగర్‌లో కొత్తగంజ్‌లో గల వినాయకుడు

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

బాలానగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నీటి గుంతలో పడి జడ్చర్ల మునిసిపల్ పరిధిలోని కావేరమ్మపేటకు చెందిన ఆంజనేయులు (32) మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. బాలానగర్ మండలంలోని బోడజనంపేటలో బీఎస్‌సీపీఎల్ క్రషర్ మిషన్‌లో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అంజనేయులు వినాయకుని నిమజ్జనం ఉందని కంపెనీ నుంచి ఫోన్ రావడంతో బోడజానంపేట క్రషర్ మిషన్‌కి వెళ్లాడు. అయితే కంపెనీలో పనిచేస్తున్న లేబర్లు అందరు కలిసి పూజలు చేసుకొని నిమజ్జనం చేసేందుకు గ్రామ శివారులోని ఓ గుంత వద్దకు వెళ్లారు. వినాయకుడిని నిమజ్జనం చేస్తుండటంతో సాయంత్రం ప్రమాదవశాత్తూ నీటి గుంతలో పడి నీటిలో మునిగిపోయాడు. ఈ విషయాన్ని కంపెనీ లేబర్ ఫోన్ ద్వారా తెలుపడంతో తాము, మృతుని కుటుంబ సభ్యులం కలిపి వెళ్లి చూడగా చీకటి ఉన్నందుని ఆంజనేయులు కనిపించలేదని తెలిపారు. శనివారం ఉదయం వెళ్లి చూడగా మృతదేహం కనిపించిందని తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అలంపూరుచౌరస్తా, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండల పరిధిలోని అలంపూరు చౌరస్తా సమీపంలో రాయచూరు వెళ్లే దారిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. కర్నూలు జిల్లా దొడ్డిపాడు గ్రామానికి చెందిన నూర్ అహ్మద్ (50) అనే వ్యక్తి అల్కాలిస్ కంపెనీలో కూలీ పని చేసుకుంటూ జీవించేవాడు. శుక్రవారం పనికి వెళ్తున్నానని చెప్పి బయటకు వచ్చాడు. అదే రోజు రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడగా అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. భార్య పర్వీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

చారకొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని కల్వకుర్తి - దేవరకొండ ప్రధాన రహదారిపై మర్రిపల్లి వద్ద శుక్రవారం రాత్రి రోడ్డుదాటుతున్న దాస్య అనే వ్యక్తికి ఢీకొట్టి అతని మృతికి కారణమైన మహబూబ్‌నగర్‌కు చెందిన కారు డ్రైవర్ షేక్‌రఫీక్‌పై కేసున మోదు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శంషుద్దీన్ తెలిపారు.

వృద్ధురాలిపై పోస్టుమన్ దాడి

» చెన్నిపాడులో ఘటన


పద్మావతమ్మ

గద్వాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌కు వచ్చిన ఓ వృద్ధురాలిపై పోస్టుమాన్ దాడి చేశాడు. ఈ ఘటన జోగళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం, చెన్నిపాడు గ్రామంలో చోటు చేసుకుంది. పింఛనుదారులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పద్మావతమ్మ అనే వృద్ధురాలు గత కొన్నేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వృద్ధాప్య పింఛన్ పొందుతుంది. గత నెల పింఛన్ తీసుకునేందుకు శనివారం ఆమె గ్రామంలో ఉన్న పోస్టు ఆఫీసుకు వెళ్లింది. అనారోగ్యం కారణంగా ఆమె చాలాసేపు వేచి చూసి తాను నిలబడలేకపోతున్నాని, పింఛన్ ఇవ్వాల్సిందిగా ముందుకెళ్లగానే పోస్టుమాన్ నబి పరుగున వచ్చి ఆ వృద్ధురాలిపై విచక్షణరహితంగా దాడి చేశాడని గ్రామానికి చెందిన పింఛనుదారులు తెలిపారు.

ఈ హఠత్పరిణామంతో అక్కడ తోటి వృద్ధులు నిర్ఘాంతపోయామని తెలిపారు. ఇదేంటి సాయిబాబు అని ప్రశ్నించినవారిపై కూడా నానా దుర్భాషలాడారని, అక్కడ ఉన్న వృద్ధులు తెలిపారు. గతంలో ఇలాంటి ఘటనలు జరగకపోయినా పింఛన్‌కు వెళ్తే చీవాట్లు, చీదరింపులు తప్పేవి కావని పింఛనుదారులు వాపోయారు.

ఈ విషయంపై బాధితురాలు మాట్లాడుతూ.. ఏం చేస్తాం సారూ.. కొట్టింది నిజం కానీ ఏమైన అంటే వచ్చే నెల పింఛన్ కూడా ఇవ్వడు.. వాడి పాపాన వాడు పోతాడు.. నేనే వృద్ధురాలిని అతడితో పింఛన్‌కు వెళ్లిన ప్రతీసారి ఎన్నో మాటలు భరించాను.. ఈసారి నాపైనే దాడి చేశాడు. ఆ దేవుడే చూసుకుంటాడంటూ బదులిచ్చింది. ఈ విషయంపై జిల్లా అధికారి మాట్లాడుతూ.. ఆ విషయం తమ దృష్టికి రాలేదని, వృద్ధురాలిపై దాడి చేయడం సబబు కాదని తెలుసుకుని సోమవారం చర్యలు తీసుకుంటామని మండల పోస్టుమాస్టర్ రామ్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

అలంపూరుచౌరస్తా, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు గ్రామ శివారులో ఘర్ డాబా సమీపంలో జాతీయ రహదారిపై వెళ్తున్న ఇసుక లారీని పట్టుకున్నట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. శనివారం బ్లూకోట్ విధులు నిర్వరిస్తుండగా మంజునాథ్‌నాయుడు అనుమానాస్పదంగా వస్తున్న లారీని తనిఖీ చేశారు. అందులో ఇసుక ఉండటంతో అనుమతులపై ఆరా తీయగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సదరు లారీని ఠాణాకు తరలించి, తాడిపత్రికి చెందిన డ్రైవర్ జగదీష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేట, కొడంగల్ ఎత్తిపోతలకు వ్యతిరేకం కాదు

» భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వండి

» బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ


కానుకుర్తి దీక్షలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ

దామరగిద్ద, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మాణం చేసే రిజర్వాయర్‌కు తాము వ్యతిరేకం కాదని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు నాగూరావు నామాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ అన్నారు. రిజర్వాయర్‌లో భూములు కోల్పోయే రైతులకు బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం న్యాయమైన పరిహారం చెల్లించి రిజర్వాయర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. కానుకుర్తి రిజర్వాయర్‌లో భూములు కోల్పోయే రైతులు గత 24 రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు శనివారం మద్దతు తెలిపి మాట్లాడారు. ముఖ్యమంత్రి మన జిల్లా వాసి ఉండి భూములు కోల్పోయే రైతులకు న్యాయం చేయకుంటే ఎలా అని ప్రశ్నించారు. సీఎం అనుకుంటే పరిహారం పెంచడం పెద్ద పని కాదన్నారు. నారాయణపేట నియోజక వర్గ రైతులు భూములు కోల్పోయి త్యాగం చేసి కొడంగల్ నియోజక వర్గానికి నీళ్లు ఇస్తున్నారని గుర్తు చేశారు. ఇంత త్యాగం చేసిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సత్యయాదవ్ మాట్లాడుతూ ప్రాజెక్టు డీపీఆర్ రైతులు ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. రైతుల అనుమతి లేనిదే వారి పొలాల్లోకి వస్తే ఊరుకునేది లేదన్నారు. రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించి రిజర్వాయర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు సంజీవగౌడ్, సత్యనారాయణ, రఘు, రామయ్యగౌడ్, గోపాల్‌రావు, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, బసిరెడ్డి, బస్వరాజు, భీంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

క్యూ కట్టినా.. కొసరుతోనే సరి..

యూరియా కోసం కర్షకలోకం క్యూకట్టింది. ఎరువుల కోసం రోజూ ఏకరువు పెడుతున్నా అధికారుల్లో చలనం కనిపించటం లేదు. కొరత లేదంటూనే మొక్కుబడిగా ఒకట్రెండు బస్తాలతో సరిపెడుతున్నారు. దీంతో రైతులు పీఏసీఎస్ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన దౌర్భాగ్యం నెలకొంటున్నది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా యూరియా కోసం అన్నదాతలు పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతం. శనివారం కూడా పలు ప్రాంతాల్లో క్యూకట్టినా యూరియా దొరక్క నిరాశతో వెనుదిరగడం కనిపించింది. కొందరైతే దొరికిన కాడికి మహాప్రసాదంగా భావించి తీసుకెళ్లారు. కొన్నిప్రాంతాల్లో పోలీసుల సమక్షంలో యూరియా సరఫరా కొనసాగింది. కొందరు రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి.


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ముందు యూరియా కోసం బారులు తీరిన రైతులు

కందనూలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ముందు శనివారం క్యూ కట్టారు. సహకార సంఘానికి యూరియా వచ్చిందన్న విషయం తెలుసుకున్న రైతులు ఉదయం నుంచి వచ్చి సహకార సంఘం నుంచి ఒక్కొక్కరు రెండు బస్తాల చొప్పున యూరియాను రైతులు తీసుకెళ్లారు.

● ఉప్పునుంతల: రైతులకు సరిపడా యూరియా అందించాలని సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు అన్నారు. శనివారం ఉప్పునుంతలలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ముందు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నాయకులు సైదులు, చంద్ర, నరేస్, సాయిబాబు, గెలుమయ్య, రైతులు తదితరులు ఉన్నారు.

● శ్రీరంగాపురం: శ్రీరంగాపురం మండల పరిధిలోని వెంకటాపూర్ ప్రాథమిక సహకార సంఘం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. పట్టా పాసు బుక్ ,ఆధార్ కార్డుకు ఒక యూరియా బస్తా మాత్రమే ఇస్తామని అధికారులు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

● గోపాల్‌పేట: వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో యూరియా కోసం రైతున్నలు కష్టాలు పడుతున్నారు. శనివారం ఉదయం నుంచే మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం ఎదుట రైతులు క్యూలో నిలబడ్డారు. గంటల సమయంలో క్యూలో నిలుచున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తోపులాట జరుగుతుందని ఉద్దేశంతో పోలీసులు ప్రవేశించి యూరియా బస్తాలను రైతులకు క్రమంగా పంపిణీ చేశారు.

● అయిజ: యూరియా కోసం రైతులు అగచాట్లు పడుతున్నారు. పనులు వదులుకుని యూరియా సంచుల కోసం క్యూలో ఎదురు చూడాల్సి వస్తోంది. శనివారం అయిజ రైతు వేదిక ముందు వివిధ గ్రామాలకు చెందిన రైతులు గుమిగూడారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి జనార్దన్, సింగిల్ విండో చైర్మన్ పోతుల మధుసూదన్‌రెడ్డిలు పర్యవేక్షించారు. రైతులకు ముందస్తుగా టోకెన్‌లు పంపిణీ చేసిన అనంతరం ఒక్క రైతుకు 2 బస్తాల చొప్పున యూరియా అందచేయటం జరిగింది.

● హన్వాడ: యూరియా కోసం అన్నదాతలు ఉదయం నాలుగు గంటలకే క్యూ కట్టారు. శనివారం హన్వాడ ప్రాథమిక వ్యవసాయ కేంద్రానికి 300 బస్తాల యూరియా తెల్లవారుజామున వచ్చింది. విషయం తెలిసి ఉదయం 4 గంటలకు పంపిణీ కేంద్రం వద్దకు వచ్చారు. అప్పటి నుంచే మహిళలు, పురుషుల దాదాపుగా 600 మందికి పైగానే రైతులు వచ్చారు.

● దేవరకద్ర: మండలంతో పాటు నాగారం సహకార సంఘం కార్యాలయం వద్ద శనివారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. రెండు సంఘాలకు రెండు యూరియా లారీలు రావడంతో 400 మంది రైతులు తీసుకునేందుకు వచ్చారు. ఒక్క బస్తా ఇవ్వడంతో దీంతో మరికొంత మందికి దొరకకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

టోకెన్ల జారీలో పోలీసులతో వాగ్వాదం


అమరచింతలో యూరియా టోకెన్ల జారీ వద్ద రైతులు

అమరచింత/ ఆత్మకూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా అమరచింత మండల శివారులో పీఏసీఎస్ తాత్కాలిక యూరియా విక్రయ కేంద్రాన్ని శనివారం ఆత్మకూరు అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడిగా ఉన్న ఆత్మకూరు పీఏసీఎస్ కేంద్రం వద్ద రద్దీ ఎక్కువ కావడంతో అధికారులు అమరచింత మండల రైతుల కోసం జూరాల ప్రాజెక్టు క్రాస్ రోడ్ వద్ద యూరియా విక్రయ కేంద్రాన్ని ప్రారంభించగా మండలంలోని ఆయా గ్రామల రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి యూరియా కోసం మళ్లీ బారులు తీరారు. పోలీస్ పహారా మధ్య ఆత్మకూరు అమరచింత వ్యవసాయ, పీఏసీఎస్ అధికారులు రైతులకు టోకెన్లను అందజేస్తున్నారు. టోకెన్ల జారీ క్యూల వద్ద రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఒక్కొక్క రైతు పాస్ బుక్‌కు రెండు సంచుల యూరియాను అందించనట్లు పీఏసీఎస్ సీఈవో నరేష్ పేర్కొన్నారు.

● ఆత్మకూరు సహకార సంఘం కార్యాలయం ముందు శనివారం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ డబ్బులు పెట్టకుండా యూరియా ఊరికే ఇస్తున్నాం అనే రీతిలో ఒక్కో బస్తా రెండు బస్తాలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. రైతులకు సరిపడా యూరియా ఇచ్చి సహకరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రైతులను వరుస క్రమంలో నిలబెట్టి ఒక్కొక్కరికి రెండు బస్తాలు పంపిణీ చేయడానికి ఆత్మకూరు ఎస్‌ఐ నరేందర్, అదనపు ఎస్‌ఐ హిమబిందు రాథోడ్‌లు శ్రమించాల్సి వచ్చింది.

ముస్లిం యువకుడి అన్నదానం


పెద్దకొత్తపల్లి బస్టాండ్ చౌరస్తాలో గణేష్‌యూత్ వారు ప్రతిష్ఠించిన గణేశ్ విగ్రహం వద్ద అన్నదానం చేస్తున్న ముస్లిం యువకుడు సలీం

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి బస్టాండ్ చౌరస్తాలో జై గణేశ్ యువక బృందం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద డెకరేషన్ సలీం శనివారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అంతకన్నా ముందు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ముస్లిం యువకుడు సలీం అన్నదానం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో విగ్రహ దాత రైస్‌మిల్ సాయి, రాజాశెట్టి, జై గణేష్ యూత్ సభ్యులు నవీన్, శ్రీనివాసులు, ధర్మతేజ, ఓంకార్, నవీన్‌గౌడ్, సురేష్, వంశీ, నరేష్ తదిత రులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక విద్యలో పట్టు సాధించాలి

» పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

» వర్సిటీలో ఓరియెంటేషన్ ప్రోగ్రాం



సమావేశంలో మాట్లాడుతున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు శాస్త్రసాంకేతిక విభాగంలో అవగాహనతో కూడిన విద్యను అభ్యసించి సబ్జెక్టులపై పట్టు సాధించాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎస్ శ్రీనివాస్ అన్నారు. ఉన్నతస్థాయికి చేరుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. శనివారం పీయూలో పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రాం కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కనుక విద్యార్థులు సబ్జెక్టుతోపాటు స్కిల్స్ పేపర్ ప్రజెంటేషన్ సాధన చేస్తే మంచి ఆఫర్లు వస్తాయని అన్నారు. విద్యార్థులు ఇంజనీరింగ్ రంగంలో పరిశోధనలు చేస్తే మరింత గుర్తింపు వస్తుందని అన్నారు. అంతకుముందు పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్ బాబు మాట్లాడుతూ నూతనంగా వచ్చిన విద్యార్థులకు తల్లి దండ్రులకు పీయూలో వసతుల గురించి వివరించారు. విద్యార్థులకు నూతనంగా విచ్చేసిన ఇంజనీరింగ్ అధ్యాపకులను పరిచయం చేశారు. పీయూలో మొదటిసారిగా సోమవారం నుంచి ఇంజనీరింగ్ తరగతులు ప్రారంభమౌతాయని, విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్ సూచించారు. పీయూ పీజీ కళాశాల పిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ పీయూ హాస్టల్స్ చీఫ్ వార్డెన్ డాక్టర్ మన్నెమోని కృష్ణయ్య, ఎంఈబీ ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణకర్‌రెడ్డి, పీయూ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికాంత్, పీయూ ఉన్నత అధికారులు డాక్టర్ గౌస్ పాష, ఎస్ఎన్ అర్జున్ కుమార్, డాక్టర్ గాలెన్న, డాక్టర్ రాంమోహన్, ఇంజనీరింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

- మురళి గౌడ్, తహసీల్దార్, పెబ్బేరు



పెబ్బేరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ కార్యాలయానికి వచ్చే రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన ప్రతీ దరఖాస్తును క్షుణంగా పరిశీలించి పరి ష్కారం మార్గంగా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ మురళి 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

రెవెన్యూ సదస్సుల్లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని పరిష్కరించారు.?

రెవెన్యూ సదస్సులో 519దరఖాస్తులు వచ్చాయి. 95 దరఖాస్తులను పరిష్కరించాం, 35 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. మిగతా దరఖాస్తులు కోర్టు, అసైన్డ్, సాదాబైనామా వివిధ కారాణాలతో పెండింగ్‌లో ఉన్నాయి.

కొత్త పట్టా పాసు బుక్కులు ఎన్ని రోజుల్లో వస్తున్నాయి.?

మూడు నెలలుగా దాదాపుగా మూడు వందల రిజిస్ట్రేషన్లు అయ్యాయి. దాదాపుగా 200 కొత్త పట్టా పాసు పుస్తకాలు రైతులకు అందాల్సి ఉంది.

విద్యార్థులు, ఇతర ధ్రువపత్రాలు ఎన్ని రోజుల్లో ఇస్తున్నారు.?

విద్యార్థులకు కుల, ఆదాయం ధ్రువ పత్రాలు ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరిస్తున్నాం. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర ధ్రువపత్రాలను క్షుణంగా పరిశీలించి పెండింగ్ లేకుండా పూర్తి చేస్తున్నాం. ఆర్వోఆర్, పహాని నఖలకు దరఖాస్తు చేసుకున్న రైతులకు నిర్ణీత సమయంలో అందజేస్తున్నాం.

సాదాబైనామాల దరఖాస్తులను పరిష్కరిస్తున్నారా.?

గత ప్రభుత్వ హయాంలో 2020 అక్టోబరు 12 నుంచి 2020 నవంబరు 10 వరకు 1308 సాదాబైనామాల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో రైతులు నమోదు చేసుకున్నారు. సాదాబైనామాలపైన కోర్టు స్టే విధించడంతో నిలిచిపోయాయి. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 48 సాదాబైనామా దరఖాస్తులు వచ్చాయి. సాదాబైనామాల పైన ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

న్యూస్ బాక్స్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

అమరచింత, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పామిరెడ్డి పల్లె గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల బిల్లు రావడంపై శనివారం లబ్ధిదారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయూబ్ ఖాన్, మహేందర్‌రెడ్డి, బండి బీసీ రెడ్డి, వెంకటయ్య, పావని పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శం

- డీఈవో అబ్దుల్ ఘనీ



ఎంఈవోకు సన్మానం చేస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగ్యంలో ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శమని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘనీ అన్నారు. శనివారం పాత పల్లిలో యూపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ గుప్త పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా సన్మానించారు. ఎంఈవోలు జయరాములు, మద్దిలేటి, నర్సింహరావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మండల విద్యాధికారి పదవీ విరమణ

చిన్నంబావి : మండల పరిధిలోని వెల్టూర్‌లో మండల విద్యాధికారి గణేష్ కుమార్ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ యాదవ్, కేఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త కళ్యాణ్ కుమార్, మండలాల ఎంఈఓలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వీపనగండ్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కల్వరాలలో శనివారం లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రమాదేవికి సీఎం సహాయనిధి నుంచి మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో రూ. రూ.22,500 మంజూరైనట్లు తెలిపారు. పేద ప్రజలకు సీఎం సహాయనిధి వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్, తిరుపతయ్య, రాముడు, మల్లేష్, కృష్ణయ్య, భరత్‌చారి పాల్గొన్నారు.

శ్రీరంగాపురం : మండల పరిధిలోని కంబాళాపూర్ గ్రామంలో ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇంటి ఇంటికి వెళ్లి లబ్ధిరులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, వెంకటస్వామి, కృష్ణయ్య, ఆనంద్, మౌలాలి, మేకల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీరంగనాయకస్వామి ఆలయాన్ని దర్శించుకున్న హైకోర్టు న్యాయాధికారి

శ్రీరంగాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీరంగనాయకస్వామి ఆలయాన్ని శనివారం హైకోర్టు న్యాయాధికారి అనిల్‌కుమార్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు విష్ణు స్వామి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు రంగనాథస్వామి ఆలయం విశిష్టత గురించి వివరించారు. జిల్లా న్యాయమూర్తులు రజని, కళార్చన, కవిత, శిరీష, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలోనూ ముఖ గుర్తింపు హాజరు

- ఫలితాలు మెరుగుపడే అవకాశం



గోపాల్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థి హాజరు తీసుకుంటున్న అధ్యాపకులు(ఫైల్)

వనపర్తి విద్యావిభాగం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ దశలో విద్యార్థుల ఫలితాలు మెరుగుపరచడానికి, ఇంటర్ విద్యను పటిష్టపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. ఇందులో భాగంగానే ఇంటర్‌లో అధ్యాపకులు, ప్రిన్సిపాల్‌ను నియమించారు. అదే విధంగా ఇంటర్ ప్రారంభంలోనే ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఇంకా కొంత మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందాల్సి ఉంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపరచడంతో పాటు, ఫలితాల్లో ఉత్తీర్ణత పెంచడంలో భాగంగానే ముఖ గుర్తింపును ప్రవేశ పెట్టినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

సమయపాలన అలవడుతుంది..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కొందరు విద్యార్థులు సమయ పాలన పాటించకుండా, ఒకటి, రెండు తరగతులకు హాజరై తిరిగి ఇంటికి వెళ్తున్నారు. కళాశాలకు నిత్యం హాజరై, అన్ని తరగతులను వింటేనే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది. కొంతమంది విద్యార్థులు కొన్ని తరగతులకు మాత్రమే హాజరవుతుండడంతో పరీక్షల్లో గట్టెక్క లేక చాలా మంది వెనుకబడిపోతున్నారు. ముఖ గుర్తింపు విధానం అమలులోకి తేవడంతో ప్రతీ ఒక్క విద్యార్థి సమయపాలన పాటించాల్సి వస్తుంది. ఎవరైనా కళాశాలకు ఆలస్యంగా వచ్చిన వెంటనే అధ్యాపకులు ప్రిన్సిపాల్స్‌కు తెలిసిపోయే అవకాశం ఉంటుంది.

ప్రత్యేక యాప్‌లో నమోదు

వనపర్తి జిల్లాలోని 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రథమ సంవత్సరం 2,141 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 1,487 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బయోమెట్రిక్ విధానం ద్వారా విద్యార్థుల హాజరు శాతం నమోదు చేసేవారు. అన్ని కళాశాలలో బయో మెట్రిక్ విధానం పని చేయకపోవడంతో నూతనంగా ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు శాతాన్ని నమోదు చేస్తున్నారు. ఉదయం కళాశాల ప్రారంభంలో విద్యార్థుల హాజరు శాతాన్ని నమోదు చేస్తుండడంతో ఉన్నతాధికారులకు ఏ రోజు ఎంత మంది విద్యార్థులు హాజరయ్యేది సులభంగా తెలిసిపోతుంది. ఏదైనా కళాశాలలో హాజరు శాతం తగ్గితే దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. కళాశాల ప్రారంభం నుంచే విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. దీంతో ఉత్తీర్ణత ఫలితాలు మెరుగవడానికి కూడా అవకాశం ఉందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు చెబుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ కీమ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కీమ్యానాయక్

వనపర్తి రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఖరీఫ్ 2025-26 సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధిత శాఖల అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ కిమ్యానాయక్ ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ తన ఛాంబర్‌లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ సీజన్లో ధాన్యం కొనుగోళ్ల కోసం పీఏసీఎస్, ఐకేపీ, మెప్మా ద్వారా 414 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేయాలన్నారు. సన్న రకం, దొడ్డు రకం కలిపి నాలుగు లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా ఉన్నట్లు తెలిపారు. పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, పౌరసరఫరాల డీఎం జగన్మోహన్, ఉమాదేవి, ఆంజనేయులు గౌడ్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ కార్డును వినియోగించుకోవాలి

- జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి వేణుగోపాల్



ఈ-శ్రమ్ కార్డులు అందిస్తున్న అధికారులు

వనపర్తి టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ఈ-శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించిందని, కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి వేణుగోపాల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గల లేబర్ అడ్డాలో అసంఘటిత కార్మికులకు ఈ-శ్రమ్ కార్డుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అసంఘటిత రంగానికి చెందిన కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం లభిస్తుందన్నారు. అనంతరం పలువురు కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులను పంపిణీ చేశారు. సిబ్బంది రఫీ, మద్దిలేటి, నిశాంత్, సీఐటీయూ జిల్లా నాయకుడు వెంకటయ్య పాల్గొన్నారు.

కొత్తకోట : అసంఘటిత కార్మికులు ఈ శ్రమ్ కార్డులను వినియోగించుకోవాలని జిల్లా కార్మికశాఖ అధికారి వేణుగోపాల్ అన్నారు. శనివారం పట్టణ చౌరస్తాలో లేబర్ అడ్డాలో అసంఘటిత కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడారు. ఆధార్‌కార్డు జిరాక్స్‌తో వచ్చి పేరు నమోదు చేసుకొని కార్డు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కార్మిక శాఖ సిబ్బంది రఫీ, మద్దిలేటి, నిశాంత్, భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య ఉన్నారు.

వెనుకబడిన విద్యార్థుల్లో పఠన సామర్థ్యాలు పెంచాలి

- ఎంఈవో జయశంకర్

ఖిల్లాఘణపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వెనుకబడిన విద్యార్థుల్లో తెలుగు, ఆంగ్ల భాషల్లో పఠన సామర్థ్యాలు పెంచాలని ఎంఈవో జయశంకర్ పిలుపునిచ్చారు. మండలంలోని మామిడిమాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం ఏ ఎక్స్‌ఎల్ ప్రోగ్రాం (కృత్రిమ బోధన) కంప్యూటర్ విద్యను ఎంఈఓ జయశంకర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలోని మూడు నుంచి 5వ తరగతి విద్యార్థులకు వెనుకబడి ఉన్న విద్యార్థులకు కంప్యూటర్ విద్య ద్వారా మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉందని అన్నారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు చెన్నప్ప, రంగయ్య, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.


ఎలక్ట్రికల్ వాహనాల కేటాయింపుపై హర్షం

అమరచింత, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : అమరచింత మునిసిపాలిటీకి సీడీఎంఏ కమిషనర్ టీకే శ్రీదేవి చెత్త సేకరణ కోసం రెండు ఎలక్ట్రికల్ వాహనాల కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మూడు మునిసిపాలిటీలకు ఎలక్ట్రికల్ వాహనాలు కేటాయించగా... అందులో అమరచింత మునిసిపాలిటీకి చెత్త సేకరణ కోసం రెండు వాహనాలను కేటాయించడం సంతోషకరమని అన్నారు.

'గాడి తప్పిన విద్యా వ్యవస్థ'

పెబ్బేరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పవన్ కుమార్ విమర్శించారు. వీరభద్ర డిగ్రీ కళాశాలలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పదకొండు ఏళ్లు గడుస్తున్న పెబ్బేరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేకపోవడం బాధకరమన్నారు. విద్యార్థులకు తరగతి గదులు, కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో కళాశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన ప్రభుత్వ భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం పీడీఎస్‌యూ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహేష్, కార్యదర్శిగా సాయి కుమార్, సహాయ కార్యదర్శి రఘు తదితరులను ఎన్నుకున్నారు.

పూజలందుకుంటున్న గణనాథులు



కొత్తకోటలో దాతను సన్మానిస్తున్న నిర్వాహకులు

కొత్తకోట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వీధివీధిన వెలసిన గణనాథులు భక్తులచే పూజలు అందుకుంటున్నారు. డీసీసీబీ కాలనీ వినాయక మండపంలో ఫలహార దాత బుజ్జి దంపతులను నిర్వాహకులు నరసింహయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, కృష్ణయ్య శాలువాతో సన్మానించారు.

రేవల్లి, : మండల కేంద్రంలోని వివిధ గ్రామాల్లో వినాయక విగ్రహాల వద్ద యువకులు పూజలు చేస్తూ అన్నదానాలు నిర్వహిస్తున్నారు. మండలంలోని తలుపునూరు గ్రామంలో వివేకా నంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి దగ్గర పూజ చేసి అనంతరం యువకులు అన్నదానం చేశారు.

ఘనంగా నిమజ్జనం

వీపనగండ్ల : మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జనం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గణనాథునికి చివరి పూజలు నిర్వహించి ఆట పాటలతో ఊర చెరువుకు తరలించి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రియాంక వంశీకృష్ణ, వెంకటేష్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



వీపనగండ్లలో నిమజ్జనం చేస్తున్న యువకులు

విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

వీపనగండ్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : విధులపై నిర్లక్ష్యం చేస్తే తగు చర్యలు తీసుకుంటామని డాక్టర్ వంశీకృష్ణ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలతో అపరిశుభ్రత ఏర్పడి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. డాక్టర్ హేమవర్ధన్, కర్ణశ్రీ, భాగ్యశ్రీ, ప్రవిత, మౌనిక, కమలమ్మ, విజయకుమారి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దురుసుగా ప్రవర్తిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

వనపర్తి వైద్యవిభాగం, ఆగస్టు 30 : గర్భిణులపై దురుసుగా ప్రవర్తిస్తున్న సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రం సమీపంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఏఐవైఎఫ్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో స్కానింగ్ కోసం వస్తున్న గర్భిణులపై అక్కడి స్టాఫ్ నర్సులు కొందరు చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నారని, డాక్టర్ రాసిన స్లిప్పులను పూర్తిగా చూడకుండా గంటల తరబడి నిలబెట్టుతున్నారని అన్నారు. వెంటనే జిల్లా ఉన్నాతాధికారులు విచారణ చేసి బాధ్యతను మరుస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నరేష్, అశోక్, రవి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

తీరిన ఉపాధ్యాయుల కొరత

పెబ్బేరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని రెవెన్యూ కార్యాలయం సమీపంలోని చెంచువాడ కాలనీలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం 94 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి ఉపాధ్యాయుల కొరత విషయాన్ని శుక్రవారం చెక్కుల పంపిణీ చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యాశాఖ అధికారులతో మాట్లాడి ఉపాధ్యాయ కొరత తీర్చాలని చెప్పడంతో శనివారం పాఠశాలకు డిప్యూటేషన్‌పై ఇద్దరు ఉపాధ్యాయులను ఎంఈవో జయరాములు నియమించారు.

రుణాలు రెన్యూవల్ చేయాలి



ధర్నా చేస్తున్న నాయకులు రైతులు

అమరచింత, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రైతుల పంట రుణాల చెల్లింపుల విషయంలో వడ్డీ మాత్రమే కట్టించుకొని రుణాలను రెన్యూవల్ చేయాలని కోరుతూ శనివారం అమరచింత యూనియన్ బ్యాంకు ముందు ఏఐయుకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కే.రాజన్న మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంకు పరిధిలోని ఆయా గ్రామాల పంట రుణాలను మధ్యవర్తు ప్రమేయంతోనే రెన్యూవల్ చేస్తున్నారని ఆయన విమర్శించారు. బ్యాంక్ అధికారులు అసలు వడ్డీ చెల్లిస్తేనే పంట రుణాలు రెన్యూవల్ చేస్తామని నిబంధన పెట్టడంతో రైతులు డబ్బులు లేక దళారుల వద్దకు ఆశ్రయిస్తున్నారని అన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని యూనియన్ బ్యాంక్ మేనేజర్‌కు అందించారు.

కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, నాయకులు రాజన్న, వెంకటయ్య, ప్ర సాద్, వాసారెడ్డి, జి.రవి ,మహేంద్ర చారి, చింతలన్న, సంజీవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నల్లారెడ్డి, బి.రాజు, సుధాకర్ రెడ్డి, వెంకటయ్య, జనార్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకు రావాలి

- ఎస్పీ రావుల గిరిధర్



వినాయక పూజలో పాల్గొన్న ఎస్పీ రావుల గిరిధర్

పెద్దమందడి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : యువత చదువుతో పాటు సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకు రావాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. మండల పరిధిలోని జగత్‌పల్లిలో జై భవాని యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఉత్సవ పూజకు ఎస్పీతో పాటు ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పూజలు చేశారు. అనంతరం గ్రామస్థులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ... యువత చేడు వ్యసనాలకు బానిస కాకుండా జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని అనుకున్నది సాధించి తీరాలని సూచించారు. దేవుళ్ల పేరుతో ర్యాలీలు, డీజేలు పెట్టుకొని కొందరు యువత మద్యం తాగి మన సంప్రదాయానికి చెడ్డ పేరు తెస్తున్నారని అన్నారు. దీన్ని ప్రతీ ఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు. సంస్కృతిక కార్యక్రమాలతో పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో వినాయకుని నిమజ్జనం చేయాలని సూచించారు.

ర్యాలీలలు డీజేలకు అనుమతి లేదని, ఎవరు పెట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జై భవాని యూత్ సభ్యులు ముంత మల్లేష్, చవ్వ సురేష్, శశిధర్‌రెడ్డి, చవ్వరాజు, శశిధర్‌రెడ్డి, శివ, ప్రకాష్, బాలరాజు, చవ్వ శివ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలు ఆందోళన చెందొద్దు

- పీఏసీఎస్ చైర్మన్ మురళీధర్ రెడ్డి



మాట్లాడుతున్న మురళీధర్‌రెడ్డి

ఖిల్లాఘణపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో యూరియా కొరత లేదు.. అన్నదాతలు ఆందోళనకు గురికావొద్దని పీఏసీఎస్ చైర్మన్ మురళీధర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార పరపతి సంఘం కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గతంలో వానకాలు, యాసంగి సీజన్‌లకు కలిపి పీఏసీఎస్ ద్వారా 12,150 బస్తాల యూరియా సరఫరా చేయగా ఈ వానకాలం సీజన్ ఒక నెలలోనే 9,330 బస్తాలు పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. మరో 10 నుంచి 15వేల బస్తాలు పంపిణీ చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. గతంలో మండలం పరిధిలో పంట సేద్యం 14 వేల ఎకరాల్లో సాగు చేయగా.. ప్రస్తుతం 18 వేల ఎకరాల్లో పంట సాగు జరుగుతుందని అన్నారు. మండలానికి 1800 టన్నుల యూరియా అవసరముండగా ఇప్పటి వరకు 1695 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించినట్లు తెలిపారు. ఈ సీజన్‌లోక్ ప్రభుత్వం ఇప్పటివరకు మండలంలోని రైతులకు ఫర్టిలైజర్ దుకాణాల ద్వారా 30వేల బస్తాల యూరియా సరఫరా చేయగా పీఏసీఎస్ ద్వారా 9,330 బస్తాలను కేటాయించి అందజేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఎంపీ మల్లు రవి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి సహకారంతో రైతులకు యూరియా ఇబ్బంది లేకుండా సరఫరా చేస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో యూరియా పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ క్యామ రాజు, మాజీ చైర్మన్ వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, రవి నాయక్, ప్రకాష్, నరసింహరెడ్డి, గోవిందు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు అధికారులకు పట్టవా?

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు గద్వాల సాయిలీల



రోడ్డుపై నాట్లు వేస్తున్న ఐద్వా సభ్యులు

వనపర్తి టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పద్మావతి కాలనీలో నెలకొన్న సమస్యలు అధికారులకు పట్టావా? అని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు గద్వాల సాయిలీల ప్రశ్నించారు. శనివారం జిల్లా కేంద్రంలోని 9వ వార్డు పద్మావతి కాలనీలో నెలకొన్న సమస్యలపై ఐద్వా సంఘం నాయకులు కాలనీకి వచ్చే రోడ్డుపై వరి నాట్లు వేస్తూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఐద్వా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఉమా, లలిత, సుశీల, రమీజా బేగం, పార్వతి, కమల, అరుణ, వెంకటమ్మ, శారద, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు లిస్టులో తప్పులుంటే అభ్యంతరాలు తెలపాలి

- ఎంపీడీవో రవీంద్రబాబు



ఆత్మకూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీపాద

వనపర్తి రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఇది వరకే ఆయా గ్రామ పంచాయతీలో ఓటరు లిస్టులను అందుబాటులో ఉంచామని, ఓటరు లిస్టులో ఏమైనా తప్పులుంటే అభ్యంతరాలు తెలపాలని ఎంపీడీవో రవీంద్రబాబు ప్రజాప్రతినిధులకు సూచించారు. శనివారం వనపర్తి పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మాజీ సర్పంచులకు ఎంపీటీసీ, వార్డ్ మెంబర్లు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులకు ఓటరు లిస్టు అభ్యంతరాలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 26 గ్రామపంచాయతీలో 230 వార్డులు 230 పోలింగ్ స్టేషన్లో ఉన్నాయని అన్నారు. ఓటరు లిస్టులో వార్డుల వారీగా ఓటర్లను విభజించామని అన్నారు. ఫైనల్ ఓటరు లిస్టు సెప్టెంబరు 2న వస్తుందని, ఎవరికైనా తప్పుడు పేర్ల పైన, స్వల్ప మార్పులతో ఒక వార్డులో ఉన్న పేరు మరొక వార్డులో ఉంటే అభ్యంతరాలు తెలిపి రాతపూర్వకంగా ఇస్తే ఓటరు లిస్టు పరిశీలించి పేర్లను నమోదు చేస్తామని అన్నారు.

ఆత్మకూరు : ఇటీవల కాలంలో గ్రామ పంచాయతీల ఓటరు జాబితా ముసాయిదాపై మండలంలోని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ , టీడీపీ. సీపీఐ, సీపీఎం నాయకులతో శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీపాద సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో స్థాని సంస్థల ఎన్నికలు రానున్న తరుణంలో ముసాయిదా ఓటరు జాబితాను గ్రామపంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామాల్లో ప్రచురించామని తెలిపారు. ఓటరు జాబితాపై, అభ్యంతరాలను తెలపాలని ఆయా పార్టీల నాయకులను కోరినట్లు తెలిపారు. అందుకు ఆయా పార్టీల నాయకులు ఒక్కరోజు మాత్రమే తప్పుఒప్పుల సవరణకు సమయం ఇవ్వడం సరైంది కాదని అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలకు ఆధారంగా సమయం ఇచ్చినట్లుగా ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీరామ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీనివాసులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్, తిరుపతయ్య గౌడ్, లక్ష్మీనారాయణశెట్టి పాల్గొన్నారు.

రేవల్లి మండలంలో 13,463 ఓట్లు

రేవల్లి : మండలంలో బండరావిపాకుల, గౌరీదేవిపల్లి, కేశంపల్లి, కొంకలపల్లి, నాగపూర్, పాత తండా, శానాయిపల్లి, తలుపునూరు, రేవల్లి మండల కేంద్రంలో కలిపి మొత్తం తొమ్మిది గ్రామాల్లో 82 వార్డులు 82 పోలింగ్ స్టేషన్లు 6720 మహిళలు, 6743 పురుషులు మొత్తం 13,463 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని ఎంపీడీవో నరసింహరెడ్డి తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఓటరు జాబితా సమావేశంలో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు. పర్వతాలు, శివరాంరెడ్డి, అజయ్‌గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను సరి చేయండి

గోపాల్‌పేట (ఏదుల) : మండలంలోని ఓటరు జాబితాను సరి చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రమేష్, మహ్మద్, అబ్దుల్లా, కురుమయ్య, అశోక్, వెంకటస్వామి, నితీష్, బాలు పాల్గొన్నారు.



వనపర్తిలో మండల ప్రజా ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రవీంద్రబాబు



గోపాల్‌పేటలో వినతి పత్రం అందజేస్తున్న నాయకులు